# ఎవరు విధించినా శిక్ష!

## కుసుమూరి వెంకట మహాలక్ష్మి

"లతా! యివిగో – సంతకాలుపెట్టు" అన్నాడు హేమంత్.

ఆ పిలుపుకి వులిక్కిపడిన లత వెర్రిదానిలా భర్తని చూస్తూ అతనందిస్తున్న కాగితాల్ని అందుకుంది.

"నీ పేర బ్యాంకిలో యాభైవేల రూపాయలు వేసాను. అదికాక నెలనెలా నీ తిండికి, యితర ఖర్చులకి ఎంతకావాలో చెప్పు – పంపిస్తాను. ఈ కాగితాలమీద సంతకాలు పెట్టావంటే నా పరపతి వుపయోగించి నీ కేంకావాలన్నా చేస్తాను" అంటూ ఠీవిగా నిలబడి అడుగుతున్న హేమంత్‌ని సూటిగా చూడలేక తల దించుకుని లోపలికెళ్ళిపోయింది లత.

కట్టలు తెగిన గోదావరిలా పొంగుకొస్తున్న కన్నీటిని ఆపుకోలేక వెగుపులు. ఏడుపు పైకి వినపడకుండా కొంగు నోట్లో కుక్కుకుని కుమిలిపో సాగింది లత.

ఓదార్చేవాళ్ళూ, వూరుకోబెట్టేవాళ్ళూలేని ఆ కొంపలో తనని తనే ఊరడించుకుని, హేమంత్ యిచ్చిన కాగితాలని తీసి చదవసాగింది. లత.

అది లాయర్‌చేత రాయించుకొచ్చిన విడాకుల నోటీసు.

దేశంలో ఎందర్నో విడాకులు తీసుకున్నవారిని చూసింది. కానీ తనకేసు మాత్రం చాలా విచిత్ర మైంది.

పెళ్ళయిన కొత్తలో లతా, హేమంత్‌లని చూసిన వారు మేడ్ ఫర్ ఈచ్ అదర్ అనేవారు. ఆ దంపతుల అందచందాలు, అన్యోన్యతచూసి ఆనందించేవారు కొందరయితే, అసూయపడేవారు మరి కొందరుండే వారు. ఆ దాంపత్యాన్నిచూసి ఓర్వలేనివారిలో నేనూ వున్నానంటూ అగ్నిహోత్రుడు ఓరోజు వంట చేస్తున్న లతని ఆక్రమించుకుని మాంసం ముద్దని చేసేసాడు. కొద్దినెలలపాటు ఆసుపత్రిలో వున్న లత ఆకారం మారిపోయి ప్రాణాలతో మాత్రం తిరి గొచ్చింది. శరీరమంతా ముడుచుకుపోయి, కాలి పోయిన మచ్చలతో వికృతంగా తయారయింది. వేలకివేలు ఖర్చుపెట్టి ఎంతో బాధ్యతగా వైద్యం చేయించి, బ్రతికించి యింటికి తీసుకొచ్చిన భార్యతో మాత్రం యిదివరకులా వుండలేకపోతు న్నాడు హేమంత్. ఈ సంఘటన జరిగిన కొద్దికాలం తరవాత తీసుకున్న నిర్ణయానికి ఫలితమే ఈ విడాకులు.

'నా భార్య అంటే నా హోదాకు తగినట్లు వుండాలి. పార్టీలకి, ఫంక్షన్లకీ వెంట తీసుకువెళ్తే నిన్ను నలుగురూ చూసి 'హేమంత్‌కి తగిన భార్య' అని అనాలి. నీ యీ అనాకారత్వాన్ని ఏ ఒక్కరూ సానుభూతితోగానీ, జుగుప్సతోగానీ చూస్తే నేను సహించలేను. నిన్ను నా వెంట తీసుకెళ్తే, వాళ్ళు నిన్నుచూసే ప్రత్యేకమైన చూపుల్ని చూస్తూ నేను తట్టుకోలేను. కాబట్టి నేను నీతో కాపరం చెయ్య లేను." అన్న హేమంత్ మాటలు చెవుల్లో గింగురు మంటున్నాయి. ఆ మాటల్ని అమలుపరుస్తూ గత కొద్దిరోజులుగా తనతో కారులో రోజూ ఓ అమ్మాయిని తీసుకొస్తున్నాడు. తనఎదుటే వాళ్ళిద్దరూ చనువుగా మసలడం సహింపరాని దయింది. ఇద్దరూ సినీమాలకి, షికార్లకీ తిరగడమే కాకుండా త్వరలో పెళ్ళిచేసుకోబోతున్నట్లు కూడా నిర్భయంగా చెప్పిన హేమంత్ మాటల్ని మూగ దానిలా వింది.

లత ఆలోచనలు ఒకసారిగా కొన్నేళ్ళ వెనక్కి పరి గెత్తాయి.

జ్ఞానంలేని వయసులో తల్లిని పోగొట్టుకున్నా, ఆ లోటుని కనపడకుండా తండ్రి లతని అరిచేతుల్లో పెట్టుకు పెంచిపెద్దచేసాడు. ఆమె ఆడింది ఆట, పాడింది పాటగా సాగిన ఆమె జీవితంలో ఎన్నడూ దేనికీ కష్టపడి ఎరగదు.

తండ్రి కూతురికోసం మళ్ళీ పెళ్ళి కూడా చేసుకోకుండా అతని జీవితాన్నంతా తనకే ధారపోసాడన్న అభిమానంతోనయినా తండ్రికోరిక తీర్చలేదు. అదే తండ్రి తన్ని డాక్టర్ని చెయ్యాలన్న కోరిక. డాక్టర్ అవడం, అవకపోవడం మాట అటుంచి అసలు చదువంటేనే అయిష్టత చూపే లత పదోక్లాసు దాకా బలవంతాన్ని స్కూలు కెళ్ళి, యింక చదవనని మంకుపట్టుపట్టడంతో కూతుర్ని నొప్పించడం యిష్టంలేక, ఒప్పించలేక ఓడిపోయిన తండ్రి ఆమె భవిష్యత్ తీర్చిదిద్దడానికి మార్గాన్నాలో చించి, ఓ బీదింటి నుంచి డిగ్రీ చదువుతున్న అబ్బాయిని చూసి తెచ్చి అతనికి తన కూతుర్నిచ్చి



## ఇదీ మార్పేనా? డా. సి. నారాయణరెడ్డి

ఎప్పుడూ లేను నేను ఇలా బితుకు బితుకుమంటూ
ఉరకలెత్తే వి కుందేళ్ళూ నక్కలూ
ముదురు తుమ్మ చెట్ల గుబురు నీడల్లో
పలికేవి గువ్వలు పగటి వేళల్లో
అరిచేవి గుడ్లగూబలు అర్ధరాత్రుల్లో
ఎగిరేవి గద్దలూ రాబందులూ గగనసీమల్లో
ఇంతలో ఎంత మార్పు?
ముల్లేమూటా సర్దుకుని
వెళ్ళిపోయింది ప్రతిప్రాణి
ఈ చోటుకు చీటీ యిచ్చి
ఇంకా ఇక్కడే వున్నారు ఒక కొందరు
పాపం బతికుండగానే చచ్చి
ఇక్కడ పాడదిప్పుడు ఒక్క కీచురాయైనా
అడ్డంగా నిలువుగా చీల్చేశాయి నన్ను తారు రోడ్లు

వెర్రెత్తి పోతోంది నాకు
కీచు చెప్పుల సవ్వడి వినాలని
విహ్వలత పెరుగుతోంది నాకు
వేణునాదాల జడిలో తడవాలని
కానీ నన్ను చరుస్తున్నాయి – వడగాలీ
కారు నలుపు బొగ్గు పొడీ శ్వేతభస్మధూళీ
ఇక్కడ దిక్కులేక పడున్నాను నేను
నెత్తురూ సత్తువా కోల్పోయి
ఈ చెట్లూ జంతు జాలాలూ
ఈ కాల్వలూ నదీనదాలూ
అన్నీ ఇంకిపోయిన ఈక్షణం
నన్నింకా చేరదేమి మరణం?

(హరికృష్ణ పాఠక్ గుజరాతీ కవితకు అనుసృజనం)

## ఎవరు విధించినశిక్ష?

పెళ్ళిచేసి ఎమ్మెస్సీ, ఆపైని ఎం బి. ఏ ను చెప్పించి తన ఆస్తిలో కొంత అమ్మి కారు పార్టుల వ్యాపారం పెట్టించి, మిగిలిన ఆస్తంతా కూతురిపేర రాసి వారి అభివృద్ధి, అన్యోన్యతనిచూసి కొన్నాళ్ళకి నిశ్చింతగా కళ్ళుమూసాడు

వ్యాపారం కాస్త పుంజుకుని మంచి లాభాలు రావడంతో వందల్ని వేలు, వేలని లక్షలు, లక్షల్ని కోట్లు చెయ్యాలన్న ఆలోచనలు రాసాగాయి హేమంత్‌కి దాంతో లత ఆస్తంతా కూడా అమ్మి పెట్టుబడిపెట్టడమేకాకుండా, వ్యాపారాన్ని హైదరాబాద్, ఢిల్లీలవంటి పట్టణాలకి తరలించి అక్కడ మంచిలాభాలు రావడంతో మకాం కూడా ఢిల్లీకి మార్చేసాడు. ఇప్పుడు ఢిల్లీలో పెద్దమేడ కొన్నాడు కారులో తప్ప వూళ్ళో తిరగటంలేదు. విమానాల్లో తప్ప వూళ్ళు వెళ్ళడంలేదు. ఇల్లంతా విదేశీ సామాన్లతో కలకల్లాడిపోతోంది అనందం. ఐశ్వర్యం అంతా లతా హేమంత్‌ల మధ్యే బంధింపబడివుందా? అన్నట్లుంది వారి సంసారం.

ఆ ముచ్చటైన సంసారంలో వారిప్రేమ పంటగా వుదయించిన చిన్నారికి 'వసంత్' అని పేరు పెట్టుకున్నారు.

వసంత్‌కిప్పుడు అయిదోఏడు. తెలిసీ తెలియని వయసు తల్లిని నీ స్థితిలో చూసి కొన్నాళ్ళు భయపడి దగ్గరకిరాలేదు. తరవాత తల్లిని వదలకుండా అంటిపెట్టుకుని తిరగసాగాడు. ఈమధ్య తల్లి దిగులుగా కూర్చోడం, కుమిలి, కుమిలి ఏడవడం ఆ పశిహృదయాన్ని పిండసాగింది. చిన్నారి చేతులతో తల్లి నూరడించే కొడుకుని అక్కునచేర్చుకుని మరింత బాధపడేది. లతమీద ప్రేమ తగ్గిన హేమంత్ వసంత్‌ని కూడా యిదివరకులా చేరదీయడం మానేసాడు. అది గ్రహించిన వసంత్ తండ్రిని చూడగానే బెదిరిపోయి తల్లిదగ్గరకెళ్ళిపోయేవాడు.

లత అందిచ్చిన విడాకుల కాగితాలని ఆనందంగా అందుకున్న హేమంత్ మరికొద్ది కాలానికే తన పి. ఎ. శిరీషని రిజిస్ట్రీ మేరేజ్ చేసుకొని తన మేడ లాన్‌లోనే పెద్ద ఎత్తున డిన్నర్ ఏర్పాటు చేసాడు. ఢిల్లీలోని పెద్ద పెద్ద పారిశ్రామికవేత్తలు, ఉద్యోగస్తులు, మంత్రులు వచ్చి వారికి కానుకలిచ్చి, అభినందించి వెళ్తున్నారు. వీడియో తీస్తూ కొందరు, ఫోటోలు తీస్తూ కొందరు, హడావిడిగా తిరుగుతున్నారు.

ఆ ఇంటి వెనకే గేరేజ్ పక్కన కట్టిన రెండు గదుల్లోకి కొడుకుతో మారిన లతకి బైట జరుగుతున్న హడావిడంతా వినపడి ఎవరో గుండెల్ని

## క్రీడారంగం క్విజ్-3

### జవాబులు

( 1) ఎడ్వర్డ్.ఎఫ్. ఈగన్. అమెరికాకు చెందిన ఇతను 1920లో లైట్ హెవీ వెయిట్ బాక్సింగ్ టైటిల్‌ని గెలిచాడు. 1932 శీతాకాలపు ఒలింపిక్స్‌లో "ఫోర్‌మాన్ బాబ్" టైటిల్ గెలిచిన టీమ్ సభ్యుడు.
( 2) భారత్‌కు చెందిన శాంతారంగస్వామి.
( 3) మార్టినా నవ్రతిలోవా. 1984 లో ఆడిన 87 మ్యాచ్‌ల్లో ఒకటి మాత్రమే ఓడిపోయింది.
( 4) విలియం మోర్గాన్
( 5) సపారో (జపాన్)
( 6) విల్సన్ జోన్స్
( 7) జిమ్మి కానర్స్
( 8) ఎస్కేప్ టు విక్టరీ
( 9) గారీ కాస్పరోవ్
(10) జాలాలుద్దీన్ (పాకిస్తాన్)

- జె. కె.

పిండేస్తోన్నట్లవుతోంది కట్టు గుడ్డకి, కడుపు నిండా తిండికి ముఖం వాచినతన్ని తీసుకొచ్చి, యింతటి వాడిని చేసినందుకా ఈ ప్రతిఫలం?" అనుకుంది. "నా డబ్బుతో కొన్న యిల్లు, నా ఆస్తి అమ్మి పెట్టుబడి పెట్టిన వ్యాపారం. ఈనాడీ స్థితిలో హేమంత్ వుండడానికి నేనూ, నా తండ్రి కారకులమన్న విషయం గుర్తుందా? ఈ విషయాలు ఆ మనిషిని నిలబెట్టి అడగాలనుకున్నా అడగలేక పోవడానికి కారణం భర్తని నమ్మి తన ఆస్తంతా అతని చేతిలో పెట్టడమే! ఆ తప్పే తన్నీనాడు ఈ నిస్సహాయ స్థితికి దిగజార్చింది. ఇప్పుడు యిల్లు, వ్యాపారం అంతా అతని పేర మీదే వుంది. 'నాదీ' అని బుజాపుపర్చడానికి ఎక్కడా ఆస్కారం లేకుండా అయింది. ఈనాడు దయాధర్మంగా ఓ యాభై వేలు తన పేర వేసి, నెలకో అయిదొందలు ఖర్చులకిచ్చి, వెనక పనివాళ్ళకని కట్టిన గదిలో వుండమని పంపేసి చేతులు దులిపేసుకున్నాడు. ఇలాంటి విశ్వాస ఘాతకుడికి వెనక వెం గుర్తుంటాయి??

అనాడు తండ్రి చదువుకోమని బ్రతిమాలినప్పుడు తను తిరస్కరించిన దానికి ఫలితం ఈనాడు బాగా 'అనుభవిస్తోంది. తనకే చదువుంటే యింత ఆస్తి పోయినా, అతడిచ్చే డబ్బు విసిరికొట్టి ఏ వుద్యోగమో చేసుకుని "నీ లెక్కెంత"ని బ్రతికి చూపించేదాన్ని" అంటూ బాధపడసాగింది లత

ఆట నుంచి పరిగెత్తుకొచ్చిన వసంత్ "అమ్మా! నాన్నగారింట్లో అందరూ బొబ్బట్లు స్వీట్లు తింటున్నారమ్మా! మనం కూడా వెళ్దామా?" అని అడగడంతో వెర్రిదానిలా కొడుకుని చూసి "అవి మనకి కాదమ్మా! అది ఇంటి కోసం" అన్న తల్లి మాటలకి "మరి నాన్నారు కూడా ఎందుకు దండలు వేసుకున్నారు?" అని అడుగుతున్న వసంత్‌ని మరిపించాలని అతని చెయ్యి పట్టుకుని పంటింటి వైపుకి నడిచింది లత

కాలం పరుగెడుతోంది ఏళ్ళు దొర్లిపోతున్నాయి హేమంత్ వయసు ముళ్ళసాగింది వసంత్ దోరమామిడికాయలా ఎదగసాగాడు చదువులోనూ అంత చురుగ్గానూ రాసాగాడు అన్నింటిలోనూ ఫస్టే! అతనికి చదువు, తల్లి తప్ప మరో ప్రపంచం లేదు తల్లి కోరిక మేరకు మెడిసిన్‌లో చేరి, పూర్తిచేసి గోల్డు మెడల్ పొందాడు ఓ పక్క ఉద్యోగం వచ్చింది మరో పక్క ఎం ఎస్ కి సీటొచ్చింది. తల్లి సలహా ప్రకారం ఎం ఎస్ లో చేరి రెండేళ్ళలో ఆ డిగ్రీ కూడా పొందాడు

డిగ్రీ పొందక ముందే వుద్యోగం వెతుక్కుంటూ వచ్చిందా అదృష్టవంతుడికి. పాతికేళ్ళు నిండిన వసంత్ డాక్టర్‌గా ఆసుపత్రికెళ్తున్న మొదటి రోజు తల్లి కాళ్ళకి మొక్కుతూ "అమ్మా! యిదంతా నీ కృషి ఫలితమమ్మా!" అని కౌగిలించుకున్నాడు

డాక్టర్ హోదాలో దర్జాగా నిలబడ్డ వసంత్‌ని సూటిగా చూస్తే దృష్టి తగులుతుందేమో అని తల దించుకొని "వెళ్ళిరా బాబూ! మానవ సేవే మాధవ

---

పాఠకులకో సవాల్!

3

# టిట్ ఫర్ టాట్!

చాలా మంది వెంటనే "రిపార్టీ"ల వర్షం కురిపించారు. కొన్ని మాత్రం ఎంపిక చేసి వేస్తున్నాం. బహుమతులు పొందిన రెండూకాక– మరికొన్ని యిక్కడ వేశాము. తతిమ్మా వారి "వాగ్బాణాలు" స్థలాభావం చేత వేయలేకపోయాం. లాటరీ తీసి కొందరి పేర్లు మాత్రం వేస్తున్నాం! ఒకసారి బహుమతి రాలేదని నిరుత్సాహం పడక మళ్ళీ ప్రయత్నించండి!

## ఒన్ టూ త్రి ఫోర్ రెడీ.... లైట్సాఫ్

## ★ రు. 25 బహుమతి పొందిన రిపార్టీ.

"ఇది రాత్రి కాదు గురూ! పగలు" -పంపినవారు : కె. శృతి (కంభంపాడు)

## ★ రు. 15 బహుమతి పొందిన రిపార్టీ

"హేండ్సప్. హనుమంతుడి ముందు కుప్పి గంతులా?"

–యస్. పి. కిరణ్ (తుని)

## ★ మరికొన్ని వాగ్బాణాలు.

"ఓ.కె. స్టార్ట్ యాక్షన్...." -పంపిన వారు : విశ్వామిత్రుడు (నాకపాలెం).

"చీకట్లో చిందులాట కదా మన సినిమా పేరు?!" –ఎల్. ప్రఫుల్ల చంద్ర (ధర్మవరం)

"ఇక్కడి నా కెమెరా కనబడ్డం లేదు నాయనో!" –ప్రకాశరావు (రాజమండ్రి)

ఇంకా హీరోయిన్ రాలేదండి! –యస్. భూమారెడ్డి (బెల్లంపల్లి)

చంపేశావు పో... నా కసలే రేచీకటి! –కె. కారంచేటి (హైద్రాబాద్)

ష్. మనం దొంగతనానికి వచ్చాం. కాస్త మెల్లిగా.

–సోమయాజుల సోదరులు (హైద్రాబాద్)

అరె! నిరోధ్ పాకెట్ కనపట్టం లేదే!!" –జి. అశోక్ చంద్ర (మెట్‌పల్లి)

వాగ్బాణాలు దూసిన మరికొందరి "లక్కీ" పేర్లు : తులసి (హైదరాబాద్), టి. యస్. కృష్ణమోహన్ (అనకాపల్లి), పి. పార్వతి (విజయనగరం), ఎస్. జ్ఞానేశ్వరి (ఖమ్మం), జె. ఉమామహేశ్వరరావు (పాలకొల్లు), వి. వీరారెడ్డి (పొద్దుటూరు) గాదె వెంకట రామారావు (అమలాపురం), పుణవర్తి పూర్ణకుమారి (అల్లవరం), కోలపల్లి ప్రియ (నెల్లూరు), ఎం. శ్రీనివాసరావు (విశాఖపట్నం), ఎస్. వి. వి. మురళీకృష్ణ (గవరకంచర పాలెం), సి. ఎచ్. శరత్ (ఆదోని), వి. జగదీశ్ (వరంగల్), ఎ. ఎస్. ఎస్. శంకరరావు (రేపల్లె), తుర్లి రాజగోపాల్ (రాజమండ్రి), రామరాజు (శ్రీకాకుళం)

## "ఏం గురూ గెడ్డం పెంచుతున్నావ్! మళ్ళీ మీ ఆవిడ...."

ఇది ఓ వాగ్బాణం అనుకోండి దీన్ని మరో వాగ్బాణంతో మీరు ఉపసంహరించాలి– ఆ "రిపార్టీ" గుచ్చుకోవాలేగాని బాధించకూడదు. రసభరితంగా వుండాలేగాని అశ్లీలం కొట్టవచ్చినట్లుండరాదు... కార్డు మీద మాత్రం రాయాలి. ఈ వాక్యం పైన రాసి మీ ప్రతి వాక్యం దాని క్రింద రాయండి. మీ పూర్తి చిరునామా ముఖ్యం. ప్రచురించిన రెంటికి రు. 25, రు. 15 చొప్పున బహుమతి వుంటుంది!– ఈ విషయంలో సంపాదకునిదే తుది నిర్ణయం. సంచిక విడుదలైన వారంలోగా పంపాలి.మర్చిపోకండి. –సం.

సేవ. శత్రువు వచ్చినా సరే డాక్టర్‌గా వైద్యం చేసి నీ బాధ్యత కర్తవ్యం నెరవేర్చుకో. పెద్ద డాక్టర్‌గా పేరు తెచ్చుకో బాబూ!" అంటూ సాగనంపింది.

ఆసుపత్రిలో చేరిన కొద్ది కాలానికే వసంత్ మంచి పేరు ప్రఖ్యాతుల్ని సంపాదించుకున్నాడు. "డాక్టర్ వసంత్ శెలవుమీదున్నా"డనగానే అయనెప్పుడు వస్తారు? ఆయనొచ్చాక వస్తాం!" అని కొందరు రోగులు తిరిగి వెళ్ళిపోయేవారు.

ఉదయం ఆసుపత్రిలో అడుగెట్టిన వసంత్ డాక్టర్ను అటూ యిటూ పరుగెలెత్తడం చూసి కారణం అడిగాడు. ఓ పెద్ద పారిశ్రామికవేత్తని బి. పి. చాలా ఎక్కువగా వుండటంవల్ల ఆసుపత్రికి తీసుకొచ్చారని, సీరియస్‌గా వుందని, నీకోసమే చూస్తున్నారని, త్వరగా రమ్మని చెప్పగానే వెళ్ళాడు వసంత్. ఎదురుగా హేమంత్! అతని శరీరమంతా అసహ్యంతో కుతకుత ఉడికిపోతోంది. ఆయాసంతో స్థిమితంలేకుండా కొట్టుకుంటోన్న అతన్ని చూసి పకపకా నవ్వాలనిపిస్తోంది. కానీ తానున్న పరిసరాలు అందుకంగీకరించవు. పైగా తల్లి చెప్పిన సూక్తులు గుర్తొచ్చాయి. ఇప్పుడు తను డాక్టరు – అతను రోగి అంతే అనుకుని తమాయించుకుని తన కర్తవ్యాన్ని నిర్వర్తించసాగాడు. రక్తపోటు చాలా ఎక్కువగావున్నందువల్ల పక్షవాతం వచ్చేసూచనలు కనపడసాగాయి. ఈ విషయాలు బైట నిలబడ్డ శిరీషకి కబురంపాడు.

సాయంకాలం శిరీష లాయర్‌తో వచ్చింది. ఏమాత్రం దయాదాక్షిణ్యాలు కనపర్చకుండా మూలుగుతున్న హేమంత్ చేత ఏవేవో కాగితాలమీద సంతకాలు పెట్టించుకుంది. జాగ్రత్తగా వాటిని పర్సులో దాచుకుని వెళ్ళిపోయింది.

మర్నాటికి డాక్టర్లు చెప్పినట్లే బి. పి. ఎక్కువయి పక్షవాతం వచ్చి హేమంత్ కుడికాలూ, చెయ్యి పడిపోయాయి. డాక్టర్లు చెయ్యగలిగింది చేసి కొన్నాళ్ళతరవాత యింటికెళ్ళొచ్చని చెప్పేసారు.

ఆస్తంతా రాయించుకున్న శిరీష మళ్ళీ ఒకసారి తప్ప హేమంత్‌ని చూడటానికి రాలేదన్న విషయం హేమంత్‌ని బాధించసాగింది. వేరే దిక్కులేని హేమంత్ తనని తనింటివద్దర దింపెయ్యమని అక్కడున్న డాక్టర్ని అడిగాడు. డాక్టరు ఓ బోయ్‌నిచ్చి హేమంత్‌ని కారులో యింటికి పంపేశు.

గేటుకి పెద్ద తాళంకప్ప కనపడటంతో బోయ్ వెళ్ళి పక్కింటావిడని అడిగాడు. వారం రోజుల నుంచి శిరీష యింటికి రావటంలేదని చెప్పిందామె.

బోయ్‌నోట ఆ మాటలు విన్న హేమంత్ మొదలు నరికిన మానులా కూలబడిపోయాడు. బుర్రలో కోటానుకోట్ల ఆలోచనలు స్థిమితంలేకుండా చేస్తున్నాయి. 'ఆస్తంతా రాయించుకుని ఈ అవిటివాడు యింకెందుకని ఎటో వుడాయించిం దన్నమాట' అనుకున్నాడు. చేసిన తప్పులు. కాదు కాదు పాపాలు ఒక్కటొక్కటే గుర్తొస్తున్నాయి. 'ఇదంతా ఆ మహాయిల్లాలి వుసురే!' అనుకున్నాడు.

ఆసుపత్రిలో తన కొడుకే తనకి వైద్యం చేస్తున్నాడని హేమంత్‌కి తెలుసు. కానీ సిగ్గుతో తనొ రోగిగా "డాక్టర్" అని సంబోధిస్తూ మాత్రం అతనితో మాట్లాడాడేతప్ప, తండ్రిగా కొడుకుని పలకరించలేదు. వసంత్ కూడా తనపట్ల అలాగే ప్రవర్తించడం గ్రహించకపోలేదు. మొదట్లో అతని తల్లికి చేసినదానికి తన్ని ఏ విషమో యిచ్చి చంపేస్తాడని భయపడ్డాడు. ఇప్పుడలా చేసినా బాగుండేదనిపిస్తోంది. తల్లికిచేసిన అన్యాయానికి వసంత్ తన్ని చంపి కసి తీర్చుకోలేదు. కానీ దేముడు కాలూ, చెయ్యి లేకుండాచేసి తన్ని చావకుండా, బ్రతక్కుండా వదిలేసి ప్రాయశ్చిత్తంచేసాడు. 'లతకి అనాకారత్వం వచ్చిందని విడాకులిచ్చాను. నా కాలూ, చెయ్యి, మూతి వంకరపోయి యిప్పుడు ఎంతో వికృతంగా తయారయ్యాను. పైగా వసంత్ ఎదురుగా యిలా అవిటిగా, అనాకారత్వంతో పడుండం అవమానంగా, బాధగానూవుంది. నా ఈ అవతారం చూసే శిరీష అసహ్యించుకునుంటుంది. నేను చేసినపనే శిరీషచేస్తే తనలో చలనం కలిగింది. బాధపడుతున్నాను."

"ఎక్కడదింపమంటారు సార్" అన్న బోయ్ మాటలు కలోకంలో కొచ్చిన హేమంత్‌లో "ఏదో ఆశ చిగురించింది.

వసంత్‌కి నామీద కనికరంపొంగి నాకు నిర్మలమైన మనసుతో వైద్యం చేసాడు. వసంత్‌ది కూడా తల్లి లాంటి దయా హృదయమే! తల్లిపోలికే! వెళ్తే యిద్దరూ కాదనరు' అనుకుంటూ "వెనక చిన్న యిల్లువుంది. కారు అటుపోనీ" అన్నాడు.

నెమ్మదిగా కారు తీసుకెళ్ళి ఆ యింటిపక్కగా ఆపుచేసి తలుపుతీసాడు. ఆ యింటి తలుపులు తెరిచేవున్నాయి. 'ఏ ముఖంపెట్టుకుని లోపలికెళ్ళాలి?' అని సందేహిస్తున్నాడు. ఆ యింట్లోంచి మాటలు గట్టిగానే వినపడుతున్నాయి. ఇద్దరి ఆడవాళ్ళ గొంతుకలవి. బాగాపరిచయమైనవే!

"లతగారూ యిది మీది. మీ సొంతం. నేను మీకు దానం, ధర్మం చేయ్యటంలేదు. మీది మీ కివ్వడానికి వచ్చాను. ఏదో ఆవేశంలో, యవ్వనపు వేడిలో చాలా తప్పుపనిచేసాను. హేమంత్ మీకు చేసిన అన్యాయానికి దేము డాయనకి చేసిన శాస్తి కళ్ళారా చూసాను. ఆ సంఘటన నాకు షాక్‌లా తగిలింది. అదే నాకళ్ళు తెరిపించింది. ఆ వెంటనే నామీద నాకే అసహ్యంపుట్టింది. వెంటనే బుద్ధితెచ్చుకుని లాయర్‌చేత కాగితాలు రాయించి ఆయనచేత సంతకాలు పెట్టించితీసుకున్నాను. అవి నా పేర కాదు, మీ పేర, మీ వసంత్ పేర రాయించాను. హేమంత్‌చేసిన పాపిష్టిపని నేను చెయ్యను. మీ సొమ్ముతిని నేనూ హేమంత్‌లా శిక్ష అనుభవించదల్చుకోలేదు. హేమంత్ రోగమే నా కళ్ళు తెరిపించి, ఈపని చేయించింది. ఈ రోజు మీ ఆస్తి మీకు అప్పచెప్పడానికి వచ్చాను. నా వుద్యోగం నాకుంది. నా బ్రతుకు నేను బ్రతుకుతాను అంటున్న శిరీష మాటలువిన్న హేమంత్ సిగ్గుతో కుంచించుకుపోయాడు.

'ఇప్పు డే ముఖంపెట్టుకుని ఈ యింటిలో పలికి అడుగెట్టగలను? శిరీష కూడా నా కంటే నీతిగల మనిషి. నే నెంత నీచుడినో పూర్తిగా అర్థమయింది'.

"బోయ్! కారు తొందరగా యిక్కడినుంచి తీసికెళ్ళిపో" అన్నాడు ఎవరేనా తన్ని చూస్తారేమో అన్న కంగారుతో కారులోకి ఒదిగిపోయి కూర్చుంటూ.

"ఎక్కడికిసార్!" అన్నాడు హేమంత్‌వైపు ఆశ్చర్యంగా చూస్తూ, అతనిప్రవర్తనకి, మాటలకి అర్థంతెలియని బోయ్!

"ఎక్కడికో తరవాత చెప్తాను. ముందిక్కడినుంచి త్వరగా కారుతీసుకుపో" అంటూ కంగారుపెడుతున్న హేమంత్‌ని విచిత్రంగా చూస్తూ కారెక్కాడు బోయ్.

"ఎక్కడికిసార్!" అని మళ్ళీ అడిగిన బోయ్‌తో –

"మనదేశంలో ఎక్కడేనా ఓల్డేజ్ హోంమ్స్ వున్నాయా బోయ్?" అన్నాడు దీనవదనంతో హేమంత్.

"ఉన్నాయి సార్" అనగానే "అయితే అక్కడికి పద" అన్నాడు నీరసంగా వెనక్కువాలిపోతూ హేమంత్. ●


**మీరూ కవలలా?**

★ మీకు కవల పిల్లలా?

★ ఏమైనా యిద్దరి మధ్య చాలా తమాషా పోలికలు– అలవాట్లు కలయికలు దగ్గరా వుంటాయి!

★ ఆడా మగా కవల లైతే మరి విచిత్రంగా వుంటుంది.

★ మీ యిద్దరి ఫొటో పంపండి! అనుభవంలో జరిగిన "తమాషా" వుంటే రాయండి.

**ఆంధ్రసచిత్రవారపత్రిక**

లో మీ యిద్దరి ఫొటో – వివరం వేస్తాము. మీ ఫొటో – విషయం రెండూ ప్రచురణామోదం కానిపక్షంలో త్రిప్పి పంపగోరువారు తగినన్ని తపాలా బిళ్ళ లంటించిన కవరు జత చెయాలి– వట్ట ఫొటోలు త్రిప్పి పంపటం సాధ్యం కాదని మనవి!

– సం.